



"చూడు, శారదా! నేను అయిదేళ్ళుగా చెబుతున్న మాటే మళ్ళీ ఇప్పుడూ చెబుతున్నాను. మనిషి ఎంత సుఖంగా బ్రతుకుతున్నాడనికాదు ముఖ్యం! ఎంత శాంతిగా, సంతృప్తిగా బ్రతుకుతున్నాడనేది ముఖ్యం! కడుపు కింత అన్నం, కట్టుకునేందుకింత బట్టా ఉంటేచాలు-అది సాదా జీవితం. అంతకుమించి ఏంకోరుకొన్నా, ఏం అనుభవించినా అది విలాస జీవితమౌతుంది. నీ అవసరాన్ని మించిన డబ్బుంటే నువ్వు ఖర్చుపెట్టు. అనుభవించు. కాని, మనకు అవసరాన్ని మించి ఉందా? నా జీతం ఇప్పుడు ఎంత? మూడు వందలు. ట్యూషన్ల వల్ల ఆదాయం నెలకు రెండువందలు. మొత్తం అయిదువందలు. నువ్వు నేను కాక మనకు ముగ్గురుపిల్లలు. చదువుకొంటూన్న నా ముగ్గురు తమ్ముళ్ళూ! వీళ్ళ కనీస అవసరాలకే నా ఆదాయం సరిపోదు. ఇక నువ్వు కోరిన చీరలెక్కడనుండి తేను? నగలెక్కడ చేయించను? ఇంట్లో స్టీల్, వెండి సామానులు ఎక్కడతెచ్చి వేయను?నీ బిడ్డలను దొరబిడ్డల్లా ఎలా పెంచగలను?...నువ్వే చెప్పు. శారూ! నువ్వుకోరిన జీవితం నీకెలా నేనందించలను?" నిస్సహాయంగా నవ్వాడు రాజారావు. "కర్తవ్యం బాధ్యత-వీటికి భంగం కలుగకుంటే నేనేమైనా చేయగలదుంటే చెప్పు. చేయకపోతే చూడు!"

"కర్తవ్యం! బాధ్యత!" మాటల్లో ఎంత తిరస్కారం చూపించవచ్చో అంతా చూపింది శారద. "ఆలుబిడ్డల్ని బికారుల్లా ఉంచి తమ్ముళ్ళను శక్తి మీరిన చదువు చదివించడం మీబాధ్యత, కర్తవ్యం! నా మగడికి అయిదువందల ఆదాయం! నాకు కట్టడానికి విడవడానికి రెండేచీరలు! అవి ఖర్మకాలి తొందరగా చిరిగిపోతే కుట్టుకొని మరీ కట్టుకోవాలి! నాపిల్లలకు మూడు జతల సాదాబట్టలు! ఇక మేంతినే తిండిగురించి చెప్పాలా? కూలీనాలిచేసుకొనే జనం నయం కదూ?"

రాజారావు కనుబొమలు పైకిలేచి నుదురు ముడుతలు పడింది. అసహనంగా అన్నాడు: "నా తమ్ముళ్ళ గురించేకదా నీ ఏడుపు? ఏం చెయ్యమంటావు

వాళ్ళను హోటల్లో కప్పులు కడగడానికి ఒకణ్ణీ, బస్సులు తుడవడానికి ఒకణ్ణీ, పల్లీలు బజ్జీలు అమ్ముకొమ్మని ఒకణ్ణీ తరిమేయనా? ఎవరి అంటూసొంటూలేకుండా నా అయిదువందల ఆదాయంతో నిన్ను రాణీలా పూజచేస్తూ నేను రాజాలా జల్సా చేయనా? చెప్పు, శారదా! నీ మరదులు ఏహోటళ్లలోనో కప్పులు కడుగుతుంటే, వీధిలో పల్లీలు బజ్జీలు అమ్మకొంటూంటే నీకు తృప్తిగా ఉంటుందంటావా?''

అంతే విసుగ్గా, అసహనంగా జవాబిచ్చింది శారద. "ఆమాట ఎవరు చెబుతారు? మీరు మాకు ఈకాస్త కూదూ గుడ్డా కూడా పెట్టి కష్టపడక్కరలేదు. రేపటినుండి నేను నాలుగిళ్ళలో పాచి పనికి కుదురుకొంటాను. నేనూ, నా పిల్లలూ ఈపాటి బ్రతకక్కపోము"

"శారదా!'' సహనాన్ని కూడదీసుకుంటూ అన్నాడు రాజారావు.'' నీకెందుకు వీళ్ళంటే ఇంతద్వేషం? వీళ్ళు నీకేం అపకారంచేశారు? వదినా వదినా అంటూ తల్లివెంటపిల్లల్లా తిరగవలసిన పిల్లలు నువ్వంటే భయపడిపోతున్నారు. మూలమూలకు ఒదిగిపోతున్నారు. నువ్వు పెట్టేతిండికూడా వాళ్ళఒంటికి పట్టడంలేదు ఈపరిస్థితి నాకెంత వేదన కలిగిస్తున్నదో తెలుసా?

"ఈ ఇంటికి పెద్ద నాన్న పోయాకు. అమ్మ నీతో మాటలు పడలేక పుట్టింటికి వెళ్ళి, జన్మలో నా పొరపాటు దిద్దుకోకుండా ఆవిడ భగవంతుడి దగ్గరికి వెళ్ళిపోయింది. ఈ పిల్లలు చిన్నపిల్లలు. వీళ్ళ భవిష్యత్తు ఏమిటి? ఇంటికి పెద్దవాళ్ళం. మన బాధ్యత విస్మరించి స్వార్థంతో ప్రవర్తిస్తే దేవుడుకూడా మనల్ని క్షమించడు, శారదా!''

"నాకీ పెద్దరికమూ వద్దు. చాకిరీ వద్దు."

"వద్దనుకొంటే తప్పేదికాదు. ఈ బాధ్యత నువ్వు స్వీకరించకతప్పదు. కోపంతో, ఈర్ష్యతో, ద్వేషంతో కాదు, ప్రేమతో స్వీకరించు. అప్పుడు నీకెంత ఆనందంగా ఉంటుంది? అప్పుడు నీ దయాదాక్షిణ్యాల మీద ఆధారపడిన పిల్లలు రేపు ఒకడు డాక్టరౌతాడు. ఒకడు ఇంజనీరు అవుతాడు. ఒకడు పోలీస్ ఆఫీసరౌతాడు. వీళ్ళకు నువ్వు వదినవు. వీళ్లభవిష్యత్తు తీర్చి దిద్దిన దయామయి వదినవు! అప్పుడు నీకెంత గౌరవం? బయట వంగి వంగి నమస్కారాలందుకొనే నీ మరదులు ఇంట్లో నీకు వినమ్రులై ఉంటారు. నీ సలహా లేనిది ఏపనీ చేయరు!"

"ఎంత పిచ్చివారు మీరు! ఎంత చక్కటి బంగారుకల?" శారద హేళనగా నవ్వింది. భర్తను ఒకపిచ్చివాణ్ణి చూచినట్టుగానే చూచింది." వీళ్ళు డాక్టర్లు, ఇంజనీర్లూ కావచ్చునేమోగాని అప్పటికింకా నా మరుదులుగా మాత్రం ఉండరు ఈ గూటినిలాగే మీరు కలగనే విధంగా అంటిపెట్టుకొని ఉండరు. వాళ్ళకు మరో జంటపక్షి వస్తుంది. టింగ్ రంగా అంటూ మరో గూడు వెదుక్కని వెళ్ళిపోతారు. అప్పుడు మీరూ నేనూ పిల్లలూ చిప్ప చేతబట్టుకుని నిల్చిపోతాం. జరిగేది ఖచ్చితంగా అదే."

"అలా అయినా చింతలేదు. నా బాధ్యత సక్రమంగా నెరవేర్చానన్న తృప్తి ఉంటుంది." రాజారావు మందహాసంచేశాడు. "గీతలో కృష్ణపరమాత్మ ఏమని చెబుతాడోతెలుసునా? చెయ్యడమే నీవంతు. ఫలితం భగవంతుడివంతు. మరొకటికూడా ఆయనే చెబుతాడు- నువ్వు నాటిన పిత్తనం మంచిదైనప్పుడు అది ఏనాటికీ విషపు పండ్లను ఇవ్వదు!"

"నేను మీతో వాదించలేను. వాదించీ ప్రయోజనంలేదు. ఈ బ్రతుకింతే."

రాజారావు మృదుస్వరంతో ఇలా అన్నాడు: "నీసహకారం లేనిదే నేనొక్క అడుగుకూడా కదపలేను, శారూ! సంసార వృక్షంలో స్త్రీ తల్లివేరులాంటిది. నీ సహకారం మీదే ఈ వృక్షం భవిష్యత్తు ఆధారపడివుంది. నువ్వు కొంచెం సహృదయత అలవరుచుకోవాలని నా మనవి! ప్రతి ఇంటా తల్లీ తన బిడ్డలే ఉండరు. ఇతరులుకూడా ఉంటారు. పరస్పరం ప్రేమ, సహకారం, అవగాహన లేకపోతే ఆ ఇల్లు ఒక నరకగృహమే అవుతుంది.

"ద్వేషం, అసూయ, స్వార్థం ఎప్పుడూ మనిషిని ఒంటరిగా మిగులుస్తాయి. ప్రేమ ఆత్మీయతనూ, ప్రేమనూ పంచి ఇస్తుంది.

"నీమీదపెట్టిన బాధ్యత సామాన్యమైనదని నేను చెప్పను. మనిషి స్వసుఖాలను వర్జించి దేశసౌభాగ్యం కోసం పాటుపడడంకంటె కూడా తన కుటుంబంలోని వ్యక్తులకోసం పాటుపడడం ఎంతో గొప్పసంగతి. తన కుటుంబంలోని వ్యక్తులకోసం స్వార్థం విడనాడిన మనిషి దేశభక్తునికంటే గొప్పవ్యక్తి!"

"నేను మీ బళ్ళో చదువుకొంటున్న అమ్మాయినికాను. కట్టుకొన్న భార్యను." శారద విసురుగా లోపలికి వెళ్ళిపోయింది.

రాజారావు ఒక నిట్టూర్పు విడిచి నోటుబుక్కులో ఏదో రాస్తూండిపోయాడు.

ఇలాంటి ఘట్టాలు ఇదివరకే మామూలు అయిపోయాతడికి. కాకపోతే, ఈరోజు శారద మగవాడి మనసు ఎక్కడ గాయపడుతుందో అక్కడ గురిచూచి మాటలు విసిరింది. అయితే తను ఎటువంటి బాధాకర పరిస్థితిలోనూ సాత్వికంగా ఉండడం నేర్చుకొన్నాడు. స్త్రీ సహజంగా అవీ ఇవీ కావాలని సరదా పడుతుంది శారద! అవి తీరని కోరికలైనప్పుడు ఇలా విరుచుకుపడుతుంది.

తనూ రెచ్చిపోతే పర్యవసానం ఘోరంగా ఉంటుంది.

రాజారావు హైస్కూల్లో మాత్స్ టీచరు. కో వర్కర్లకు ఎంత ఈర్ష్యగా ఉంటుందో విద్యార్థులకు అంత అభిమానం అతడంటే. తనక్లాస్‌లో వెనక వాడినే ముందుకు తీసుకొని చెప్పడం అతడిప్రత్యేకత.

* * *

"శారదగారూ! ఇలావస్తారా?" పక్కింటి విమల వాకిట్లోకివచ్చి పిలిచింది." మూటలవాళ్ళు వచ్చారు. చీర ఒకటి సెలెక్ట్ చేసి పెడుదురూ!"

"అబ్బే! నాకేంతెలుసు ఆ గుడ్డల సంగతి? మీకే తెలియాలి, ఎప్పుడూ గుడ్డలు ఖరీదు చేసేవాళ్ళు కాబట్టి."

"మీరలా అనుకొంటారుగాని నాకేం తెలియదండీ! ఈ బట్టల సెలెక్షనుంది చూశారూ! రెండుకళ్ళను మోసంచేసినట్టుగా నాలుగుకళ్ళను మోసం చేయలేవు. అందుకే మిమ్మల్ని రమ్మంటున్నాను." శారదలో ఈర్ష్యనుగమనించినా ఇరుగుపొరుగుతో స్నేహంగా ఉంటుంది విమల. అంతమాత్రంచేత ఆవిడ గొప్ప సహృదయవతి అని చెప్పడానికి వీల్లేదు. తనకున్నవి రెండింతలుగా చూపుకొని ఏడ్చేవాళ్ళను మరింతగా ఏడిపించే సరదాగల మనిషి.

అప్పటికే మూటవిప్పుకొని కూర్చొన్నాడు మూటలవాడు. కళ్ళు చెదరగొట్టే రంగులు, ఎంత బాగున్నాయని పించే ప్రింట్లూ—నాలుగు కళ్ళకు మరి నాలుగుకళ్ళు కళ్ళు జత అయినా మోసగించే గుడ్డలే ఉంటాయి మూటలవాళ్ళ దగ్గర. అవి వెలిసిపోతాయని, వాటికి పెట్టే డబ్బు దండగై పోతుందని ఒప్పుకోడానికి మనస్సంగీకరించదు ఆడవాళ్ళకు!

కనకాంబరం రంగులో ఏవో పేరు తెలియని పువ్వులప్రింటున్న టెరికాట్




చీర సెలెక్ట్‌అయింది. ఆ చీర శారదకెంతగానో నచ్చింది.

"డబ్బులేదుగాని ఒకటి ఇలాంటిది నేనుకూడా తీద్దును!"

"నిజంగా మీఒంటిరంగుకు ఈ రంగు ఎంతో బాగుంటుందికూడా. డబ్బు నేనిస్తాను. మీవారికి జీతం అందుతూనే ఇచ్చేద్దురుగాని..."

"వద్దులెండి ఆయన కోప్పడతారు." అందేగాని ఆ చీర చేతులనుండి క్రింద పెట్టలేదు.

"తీసుకోండి. కోప్పడితే రెండు మాటలేకదా? ఒక్కసారే ఇవ్వలేకపోతే రెండు తడవలుగా ఇచ్చేద్దురు"

విమల ప్రోత్సాహాన్నీ, తనలోని ఆశనూ జయించలేకపోయింది శారద.

అయితే, భర్తకు వెంటనే చీర చూపి విమలదగ్గర తను అప్పుచేసిన సంగతి చెప్పలేకపోయింది శారద. రెండురోజుల తరువాత మూడిళ్ళవతలఉన్న వర్ధన్ సార్ భార్య పాప పుట్టినరోజు అని పిలిస్తే, కొత్తచీర కట్టుకువెళ్ళింది శారద.

శారద తిరిగివచ్చేటప్పటికి రాజారావు వచ్చి ఉన్నాడు. ఈజీచెయిర్‌లో వాలి స్కూల్‌నుండి తెచ్చుకొన్న మాగజైన్ తిరగవేస్తున్నాడు. గుమ్మంలో సవ్వడి విని తలెత్తి చూచిన అతడు రెప్ప వాల్చడం మరిచిపోయాడు. శారద తెల్లని రంగులో అందంగా ఉంటుంది. అందానికి ఇలాంటి ఆకర్షణ తోడైతే ఇక చెప్పేదేముంది...? ఆరాధనగా చూస్తున్న తడికళ్ళు ఆశ్చర్యంగా, ఆలోచనగా మారిపోయాయి.

చంటివాణ్ణి తండ్రిదగ్గర దించి లోపలికి వెళ్ళిపోయిన శారద గుండె టకటక కొట్టుకోసాగింది. ఏమని చెప్పాలి? అప్పుచేసి చీర తీసుకోవలసిన అవసరమేమొచ్చిందని అడిగితే ఏమని చెప్పాలి? ఆఁ! ఇలా భయపడితే లాభంలేదు. తను ఒకటికి రెండంటించడం నేర్చుకోవాలి. ఆయన పెట్టింది తిని, ఆయన తెచ్చింది కట్టుకొని... ఉహుఁ... ఇక అలాంటి కూలిబ్రతుకు బ్రతకలేదు. విమల చూడు! ఏపువ్వులతో ఏ దేవుడిని పూజించి పుట్టిందో?

మగడు జీతం తెచ్చి విమల చేతిలో పోస్తాడు. అతడి సిగరెట్లకుకూడా ఆవిడే డబ్బు ఇవ్వాలట. తన మగడు తనను లెఖ్ఖలడిగినట్టుగా ఆవిడ భర్తను లెఖ్ఖ లడుగుతుందట. సరే. విమల ఖర్చు సంగతి అడగాలా? వచ్చిన ప్రతిసినిమా, రకానికో చీర – ఒకటేమిటి! మహారాణి వైభవం ఆవిడది.

భర్త ఏ క్షణంలో లేచి లోపలికి వస్తాడోనని త్రుళ్ళి త్రుళ్ళిపడసాగింది శారద.

అయిదు నిమిషాల తరవాత బాబును ఎత్తుకొని రానేవచ్చాడు రాజారావు. ఊపిరి బిగబట్టుకొని ఏదో పనిచేస్తున్నట్టుగా ఉండిపోయింది శారద.

"చీర ఎక్కడిది, శారదా?"

"చీర బాగుందా?" తన గొంతు తనకే అసహజంగా తోచింది.

"ఫస్టుగా ఉంది. ఈ చీరలో చాలా అందంగా కనబడుతున్నావు."

"ఎంత పడిందనుకొంటున్నారు?"

"నేనెప్పుడూ చీరల వ్యాపారం చేయందే?"

ఎలాగో ధైర్యాన్ని కూడగట్టుకొని, చిరునవ్వును బలవంతాన పెదవులమీదికి తెచ్చుకొని చీరకొన్నవైనం చెప్పివేసి అక్షింతలకోసం ఎదురు చూడసాగింది.

"ఆ చీర ముప్పయి అయిదా? అదీ మూటలవాళ్ళ దగ్గరా? ఒక్క ఉతుకుతో దానిరంగు బయటపడిపోతుంది. అయినా నాకు చెప్పకుండా ఈ పనులెప్పటినుండి నేర్చుకొన్నావు? ఈ నెలలోనే శ్యామ్‌కు పరీక్షఫీజు ఏభై రూపాయలు కట్టాలి. ఇలాంటిసమయంలో నువ్వు అప్పుచేసి నా మెడకు వేయడమా? పైనెలలో నాకు ఎరియర్స్ వస్తాయి, బట్టలు కొంటానని చెప్పలేదూ?"

"చీర బాగుంది. విమల తీసుకోమంటేనూ..."

"బాగుంది మనకష్టంసంగతి ఆమెకేం తెలుసు? ఆవిడ మొగుడు రెండుచేతులా సంపాదిస్తున్నాడు. నీ భర్తది ఒక్కచేతి సంపాదనే అని తెలియదూ? నేనెన్నో సార్లు చెప్పాను. నన్నర్థం చేసుకొమ్మని, నన్ననవసరంగా బాధపెట్టవద్దని!"

శారద కళ్ళలో అప్పటికే నీళ్ళు తిరిగాయి. "మీకు నామీదున్న ప్రేమకు నేనెంతో గర్విస్తున్నానండీ!"

"నువ్వంటే నాకు ప్రేమఉందో లేదో గాని ఆ ప్రేమకు ఈ రకంగా పరీక్ష పెడితే మాత్రం నువ్వు ఘోరంగా దెబ్బ తింటావు!" రాజారావు కోపం నిగ్రహించుకొంటూ బయటికి వెళ్ళిపోయాడు.

శారదకు కోపం, దుఃఖం ఆగలేదు. ఎంత బానిసబ్రతుకు? ఒక్కచీర కూడా స్వతంత్రించి కొనేందుకు హక్కులేని బ్రతుకు! ఈ ముతకగుడ్డల్లో తోడివాళ్ళ ముందు తనకెంత చిన్నతనంగా ఉంటుందో ఆయనకేం తెలుసు? దరిద్రానికి నిరాడంబరమనే పేరు తగిలించుకొని మోసగించుకోవడం ఎంతవరకు సాధ్యం?

భార్యను గురించి ఆలోచించేందుకు ఆయనకు వ్యవధి ఏది? తండ్రిలేని తమ్ముళ్ళు, వాళ్ళ చదువులు, వాళ్ళ భవిష్యత్తుకు సోపానాలు నిర్మించడంలో ఆయనకు టైం చాలడంలేదు. ఆ దిక్కుమాలిన వెధవలకోసం తనను త్యాగం చెయ్యమని పోరుతాడు!

ఈరోజు ఈ చీరలేకపోతే తనెలా వెళ్ళగలిగేది పేరంటం? పాతగుడ్డలు కట్టుకొని బయటికి ముఖం చెల్లక వంటింట్లో ముడగడం ఎంత నరకం ఆడదానికి? తనకూ ఒక మనసుందని కోరికలుంటాయని గుర్తించని ఈ మగవాడితో ఏం సుఖముందని వెలిగించాలి కాపురం? అసలు ఏం సుఖముందని ఈ బ్రతుకు ఈడ్వాలి? ఈ పిల్లల ముఖం చూచి బ్రతకాలా? తను ఉండి మాత్రం ఏం న్యాయం చేయగలుగుతూంది వీళ్ళకు? తను చస్తే తల్లిలేని పిల్లలని కొంతలో కొంత శ్రద్ధగా, అపేక్షగా చూస్తారు...

శారదలో ఈ ఆలోచనలు క్రొత్త కాదు. తరుచూవచ్చేవే. కాని, ఈరోజు తీవ్రంగా వచ్చాయి. ఒక భయంకరమైన సంకల్పాన్ని దృఢతరం చేశాయి.

శారద గుండెలో ఏదో మంట. ఏదో ఒక ప్రతీకారం చేస్తేగాని ఆ మంట చల్లారదు. తనలాంటి అసమర్థులకు నిర్భాగ్యులకు చేతనైనది ప్రతీకారం ఒక్కటే!

ఇద్దరు పెద్దపిల్లలూ చిన్నాన్నవెంట కూరగాయలకని బజారు వెళ్ళారు. చంటివాడు అవతలగదిలో కాగితం డబ్బాతో ఆడుకొంటున్నాడు.

కిరసనాయిల్ డబ్బా ఊపి చూచింది శారద. కొద్దిగా ఉంది. చీర అంటుకోడానికీ తనుకాలి చనిపోడానికీఈమాత్రం చాలదేమిటి?

శారద కిరసనాయిల్ చీర కుచ్చిళ్ళమీద ఒంపేసుకుంది. సాధ్యమైనంత వడిగా అగ్గిపుల్ల గీచి కుచ్చిళ్ళకొసలకు అంటించింది.

నిమిషం తరువాత ఒక వెర్రికేకపెట్టి క్రింద పడిపోయింది శారద.

అప్పుడే వచ్చాడు వేణు. కేకవిని వంటింటిదగ్గరికి పరిగెత్తాడు. "వదినా! ఏమిటి?" లోపలనుండి అరుపులు తప్ప జవాబు రాలేదు. ఏదో కాలినవాసన రావడం... ఉలిక్కిపడ్డాడు. తలుపుమీద బలంగా తన్నాడు. వదులుగడియ కావడంతో తలుపులు విడిపోయాయి. లోపల కనిపించిన దృశ్యంచూచి కొయ్యబారిపోయాడు. క్షణంలో తెప్పరిల్లి ఒక్క అంగలో సమీపించాడు.

* * *

శారద మెడవరకూ దుప్పటికప్పి ఉంది. ప్రక్కన కూర్చొన్న రాజారావు ఎక్కడో పిచ్చిచూపులు చూస్తూ శిలలా కూర్చుని ఉన్నాడు. మూగిన జనం ముందు తను దోషిలా కూర్చోవడం సిగ్గుగా ఉంది.

"ఏం జరిగింది? ఏమన్నాడుమగడు? ఏదో అనకపోతే పిల్లలముఖమైనా చూడకుండా ఆత్మహత్య చేసుకొనే అవసరమేమిటి?"

ప్రశ్నల పరంపర మొదలైంది మూగిన జనంనుండి. జవాబులూ, విసుర్లూ...

"పెళ్ళి చేసుకోగానే, పిల్లల్నికనగానే సరికాదు. వాళ్ళను సుఖపెట్టడం చేత



కావాలి. చదువుకొన్నాడు. సంపాదిస్తున్నాడు. ఎందుకూ, తగలేసుకోనా? దొడ్డ ఇల్లాలు. ఏం తినేదో ఏం కట్టుకొనేదో- ఎప్పుడూ ఎవరితోనూ చెప్పుకొన్నది కాదు."

"ఇవాళ ఉన్నదంతా తమ్ముళ్ళకు దోచిపెడుతున్నాడు, భార్యా పిల్లల ముఖమైనా చూడకుండా. రేపు రెక్కలు వుడిగాక వాళ్ళెవరూ అక్కరకురారు."

"పిల్లల అదృష్టంతో బ్రతకాలిగాని లేకపోతే వేయిజన్మ లెత్తినా ఇలాంటి ఉత్తమురాలు దొరకదీ మహానుభావుడికి! అప్పుడు తెలుస్తుంది భార్యవిలువ."

రాజారావు కళ్ళనిండా నీళ్లుతిరిగాయి. నిజంగా శారద చచ్చిపోతే? శారద చచ్చిపోతుందా? నేనేం అంత అపచారం చేశానని శారద, నాకింత అన్యాయం చేస్తుంది? డబ్బులేనప్పుడు చీర ఎందుకు తీసుకొన్నావంటే - అంత తప్పా? ఇలా ఎన్నిసార్లు పేచీ పడలేదు నాతో? ఇలా ఎప్పుడూ చేయంది-ఎందుకిలా చేసింది? శారద నా ప్రవర్తనతో అంత విసిగిపోయిందా? రక్తం పంచుకుపుట్టినవాళ్లను సాధ్యమైనంత ఉన్నతిలోకి తీసుకుపోవాలనే దృఢసంకల్పంతో-తను శారద విలువ కించపరిచాడా?...ఈ సంఘటన అదే చెబుతూంది.

కాని, కాని...శారద తొందరపడింది. కొన్నాళ్లు ఓర్పుతో ఈ చీకటిని సహిస్తే వెన్నెలవస్తుందని తనెన్నిసార్లు చెప్పాడు? శారద తొందరపడడకాక ఏమిటిది?

'నా అదృష్టమో, పిల్లల అదృష్టమో శారదే బ్రతకనీ - ఆమెను సుఖపెట్టడమే నా ధ్యేయంగా పెట్టుకొంటాను. నగలతో చీరలతో ఆమెను అలంకరిస్తాను.'

టాంగా వచ్చి ఆగింది ఇంటిముందు.

టాంగానుండి క్రిందికి దూకిన వేణు లోపలికి దూసుకువచ్చి వదినను లేవనెత్తి టాంగా దగ్గరికి తీసుకుపోయాడు. "నువ్వేం గాభరాపడకు, అన్నయ్యా! వదినకేం కాదు, పిల్లల్ని దగ్గరికి తీసుకో. పసివెధవలు. ఎలా బిక్కమొగాలు వేశారో చూడు!"

కాల్చిన మాంసం ముద్దలా అగుపడుతున్న శరీరాన్ని చూచుకొంటే ఒళ్ళంతా జలదరించిపోసాగింది...హాస్పిటల్ బెడ్ మీద పడుకొన్న శారదకు. 'భగవాన్! ఈ వికృతరూపంలో బ్రతకమని నాకీ దుర్బుద్ధి పుట్టించావా? చచ్చిపోతే ఎంత బాగుండేది?'

"వదినా!"

శారద తల త్రిప్పింది.

వేణు స్టూల్ శారద దగ్గరగా లాక్కొని కూర్చొన్నాడు. "ఎలాఉంది, వదినా? చాలా బాధగా ఉందా?"

వేణు ఆర్ద్రస్వరానికిబదులుగా శారద కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"నేనీరోజు నీతో ఒక సంగతి చెప్పాలనుకొంటున్నానమ్మా"

"........."

"మా వల్ల నువ్వు చాలా బాధపడుతున్నావని, మేం నీ సుఖానికి ప్రతిబంధకంగా ఉన్నామని గ్రహించే జ్ఞానం ఇన్నాళ్ళు లేకపోయింది. నిన్నటి సంఘటన నా కళ్ళు తెరిపించింది. న్యాయంగా అన్నయ్య సంపాదనఅనుభవించే హక్కు నీకే ఉంది. అందులో మేం భాగం పంచుకోవడం అన్యాయమే అవుతుంది. ఇక ఈ చదువింతటితో కట్టిపెట్టి ఈరోజు నుండి ఉద్యోగప్రయత్నంలో పడతాను. నా ఇద్దరు తమ్ముళ్ళను నా దగ్గరికి తీసుకుపోతాను. అంతవరకూ మాత్రం నీచేత్తో మాకింతముద్దపడేయకతప్పదు."

"........."

"మాకోసం సంసారసుఖం, భార్యనూ పిల్లలనూ కూడ త్యాగం చేయగల అన్నయ్య మాకొకడున్నాడని గుర్తుంచుకొంటాం. కాని. ఇంకెప్పుడూ తనకు ముగ్గురు అభాగ్యులైన తమ్ముళ్ళున్నారనే సంగతే అతడికి గుర్తురానివ్వం!" వేణు గొంతు పట్టేసింది. కళ్ళలో నీళ్లు కనబడకుండా ముఖం త్రిప్పుకొన్నాడు.

శారద చెయ్యిచాచి వేణుచెయ్యిఅందుకొంది. తెల్లనిచెయ్యి కాలి బొబ్బలెక్కి అసహ్యంగా తయారైంది. ఆర్ద్రస్వరాన విచలితంగా అంది. "వేణూ! నా సుఖానికి ప్రతిబంధకం మీరుకాదు. ఈర్ష్య, అసహనం, ద్వేషం నా సుఖం నాశనం

చేశాయి. దేవుడులాంటి మీ అన్నయ్యను బాధపెట్టాను. నీ చేతులు కాలుతున్నా యని లెఖ్ఖచేయకుండా నా ప్రాణాన్ని రక్షించావు. నీకు కడుపునిండా అన్నం పెట్టడానికికూడా చేతులురాని ఈ పాపిని నీ చేతులు కాళ్ళుకొని మరీ బ్రతికించావు నా పిల్లలకు తల్లినిచ్చావు. ప్రేమించి చూడు – నీకెంతో సుఖంగా, తృప్తిగా ఉంటుందని నా కెన్నిసార్లో మీ అన్నయ్య బోధించారు. వేణూ! మీరిప్పుడు ఆయన తమ్ముళ్ళు కాదు. నా తమ్ముళ్ళు. ఆయనతో సమానంగా మీ అభివృద్ధికి పాటుపడతాను."

"వదినా!" దిగ్భ్రమగా చూస్తున్న వేణు కళ్ళలో అతడికి తెలియకుండానే నీళ్ళు క్రిందికి జారాయి.

* * *

"చాలు, వదినా!"

"పెరిగే పిల్లాడివి. మరీ ఇంత కొంచెం తింటే ఎలాగయ్యా?"

పంక్తిలో కూర్చొన్న రాజారావు నవ్వాడు. "తినరా! కండపుష్టితోనే అత్మపుష్టి. ఇంత అర్భకంగా ఉన్నావు. పోలీస్ ఆఫీసరు వెలా అవుతావు?"

చిన్న తమ్ముడు సుధాకర్ సిగ్గుపడ్డాడు. చిన్నప్పుడెప్పుడో పోలీసు ఆఫీసరైనట్టు ఆట ఆడితే అది చూచిన అన్నయ్య అప్పటినుండి ఇలా ఆట పట్టిస్తుంటాడు.

కొసరి కొసరి తినిపిస్తూన్న శారదను చూస్తూంటే రాజారావులో ప్రేమభావమేదో పెల్లుబికింది. ఆడది అన్నపూర్ణ కాగలిగినప్పుడు ఆ ఇంట్లో ఏ సంపదలూ లేకపోయినా అన్ని సంపదలూ ఉన్నట్లే లెఖ్ఖ. ఉన్న పట్టెడన్నం కూడా పెట్టడానికి చేతులురాక కుళ్ళు మనసుతో ఏదో కుక్కకో, కాకికో విదిల్చినట్టుగా విస్తట్లో విదిలిస్తే ఆ తిండి తిన్న మనుషులెలా ఉంటారు? ఆ మనసులెలా కుంచించుకుపోతాయి! ఇదివరలో శారద ప్రవర్తనతో ఎంతగానో నలిగిపోయేవాడు రాజారావు. ఒక కుటుంబంలో వ్యక్తులు వాళ్ళు వదినామరదులుగాని, అత్తా కోడళ్ళుగాని, తోడికోడళ్ళుగాని పరస్పరం సానుభూతి, సహకారం, ప్రేమ కలిగి ఉండకపోతే ఆ ఇల్లు ఒక నరక గృహమే అవుతుంది. తన ఇంటిలోని మనిషిని ప్రేమించని వ్యక్తి ప్రక్క వ్యక్తిని ఎలా ప్రేమించగలుగుతాడు? ప్రేమ కరువైన ఇల్లు, ప్రేమ శూన్యమైన సంఘం, ప్రేమ తెలియని దేశం ఎక్కడైనా బాగుపడుతుందా?

శారద భోజనానికి కూర్చొనేవరకు తప్పేలాలో ఒక వాయికి సరిపడే అన్నం, నీళ్ళమజ్జిగ మాత్రం మిగిలి ఉన్నాయి. అయినా ఆ భోజనం ఎప్పుడూ లేని తృప్తి నిచ్చిందంటే— అన్నపూర్ణ కాగలిగిన ఆనందం తప్ప మరేం కాదు. తనవారనుకొన్న వాళ్ళ కడుపులు నిండితే తన కడుపు నిండినట్టే ఆడదానికి.

* * *

"వదినా! ఎవరొచ్చారో చూడు!"

వేణు కేక విని వంటింట్లో నుండి చేతులు తుడుచుకొంటూ వచ్చింది శారద.

వేణు వెనక ఒక యువతి నిలబడి సంకోచంగా, సిగ్గుగా చూస్తూంది.

"ఈ అమ్మాయికి మనింట్లో ఆశ్రయమివ్వాలట, వదినా! ఏం చూసి ఇవ్వాలా అని ఆలోచిస్తున్నాను. తన దగ్గర ప్రేమధనం తప్ప మరో చిల్లికానీ కూడా లేని నిరుపేదట. చూడరాదూ బోసిమెడ, బోసి చెవులూ, బోసి..."

మరిది ధోరణి అంతుపట్టలేదు శారదకు. ఆ అమ్మాయి అతడి కళ్ళలోకి ఏదోలా చూడడం, అతగాడు ఓ చిలిపి నవ్వు విసరడం – ఆ తంతు చూశాక శారద పెదవులమీద చిరునవ్వు ఉదయించింది. కళ్ళలో ఆదరపూర్వకమైన భావమేదో కలిగింది. ఆమె దగ్గరికి వెళ్ళి, భుజం మీద చెయ్యివేసి, "దా, అమ్మా!" అంది. "నీ దగ్గర చిల్లికానీ లేదని చులకన చేస్తున్నాడు కదూ! మనిషిని అన్ని ధనాలకంటే సుఖపెట్ట గలిగేది ఈ ప్రేమధనమేనన్న సంగతి తెలియ జెప్పే బాధ్యత నీమీద ఉంది సుమా!"

"మనకులం కాదు, వదినా!అన్నయ్య ఏమంటాడో!"

"ఏ కులంరా నీది?" ఏమంటాడో అన్న అన్నయ్యగొంతే వినబడిగతుక్కుమన్నాడు వేణు.

"............"

"బ్రాహ్మణుడనని సగర్వంగా చెప్పుకుంటావుగాని, భారతీయుణ్ణని చెప్పుకోలేనందుకు సిగ్గుపడాలిరా నువ్వు! నా చిరకాల స్వప్నానికి నీకు తెలియ కుండానే రూపుదిద్దావురా నువ్వు! కుల మతాలనే సంకుచిత పరిధులు దాటి ఒక క్రొత్త లోకం సృష్టించు కోవాలి మనం. ఒక సముద్రం ఎన్ని నదులనో తన విశాల గర్భంలో ఇముడ్చుకొని గంభీరంగా ఉండి పోయినట్టుగా, మన కుటుంబంలోకి కుల మతాలనే వివక్షత లేకుండా వ్యక్తుల ప్రవేశం జరగాలి." తన కుటుంబంలో శాశ్వతస్థానం కోరిన వ్యక్తి ఒక లక్షాధికారి గారాలపట్టి అని,తలిదండ్రుల నెదిరించి ప్రేమించిన వాడి వెనుక వట్టి చేతులతో వచ్చి వేసిందని, వేణూతో పాటు హౌస్‌సర్జన్ పూర్తి చేస్తున్నదనీ తెలిసి ఉంటే-రాజారావు నోటినుండి అంత నిస్సంకోచంగా, నిష్కపటంగా మాటలు వెలువడేవి కావేమో?

రెండు రోజుల తరవాత గుళ్లో నిరాడంబరంగా పెళ్ళి జరిపించేసి, ఇంటి దగ్గర స్నేహితులకు పెళ్లిపార్టీ ఇస్తుండగా గుమ్మం ముందు ఆగిన కారులోంచి వేణు మామగారూ, అత్తగారూ దిగారు.

* * *

"ప్రేమ నిలయం" ముందుకార్లు బారు తీరాయి. ఆహూతులతో నిండి పోయింది ఇల్లూ, ఇంటి ముందరి తోటా! రాజారావు రెండో తమ్ముడు శ్యామసుందర్ కొడుకు పుత్రోత్సవం, సుధాకర్ ఫారిన్ వెళ్లివచ్చిన సందర్భం పురస్కరించుకొని గ్రాండుగా పార్టీ యిస్తున్నారు స్నేహితులనూ, తమ పరిచయస్తులనూ ఆహ్వానించి.

శారద ఇప్పుడు శారదాదేవి. రాజారావు టీచరు ఇప్పుడు రిటైర్డ్ ప్రిన్సిపాల్. ఇంటికి పెద్దవాళ్ళైన ఆ దంపతు లిద్దరూ అతిథులమధ్య చెరో కుర్చీలో కూర్చొని ఉన్నారు.

సమిష్టి కుటుంబంగా ఉండాలని సరదాపడి ఏవో కారణాలచేత, ఉండలేక పోయిన కొంతమంది మగవాళ్లకు రాజారావు కుటుంబాన్ని చూస్తే సంతోషంగానూ, అద్భుతంగానూ ఉంటుంది. కాస్త ఈర్ష్యగానూ ఉంటుంది.

ఇంటికి పెద్ద కోడలు శారదాదేవి ఇద్దరు తోడికోడళ్లమీద ఎంత అధికారం కలిగి ఉంటుందో, అంత చనువు గానూ ఉంటుంది. ముగ్గురు మరదులు ఆమెనొక దేవతగానే చూస్తారు.

వేణుగోపాల్ మామగారి సహకార ప్రోత్సాహాలమీద నర్సింగ్‌హోం తెరిచాడు. దంపతు లిద్దరూ డాక్టర్లు కావడంతో రాబడి బాగానె ఉంది. శ్యామ్‌సుందర్ అసిస్టెంట్ ఇంజనీరు. చివరివాడు ఇంకా చదువులోనే ఉన్నాడు. అందరి సంపాదనా ఒకదగ్గర చేరుతుంది.

వేణుకు ఇద్దరుసంతానం. బేబి,బాబు. అతడి భార్య రేణుక భర్తతోపాటు నర్సింగ్ హోంకు వెళ్లిపోతే, పిల్లలకు దాయిని పెడదామన్న ఆలోచనను సాగనివ్వలేదు శారద. తన పిల్లలను అంత ముద్దుగా, శ్రద్ధగా సాకిందోలేదో గాని మరిది పిల్లలను అంత ఇదిగా పెంచింది. ఆ పిల్లలకు పెద్దమ్మ దగ్గరే చనువు ఎక్కువ.

శ్యామసుందర్‌కు తొలి సంతానం యిదే. అతడి భార్యకు చిన్న వయసు. ఆ పిల్లవాడి ఆలన పాలన శారద చూసుకోవలసిందే.

సంపాదనా, ఇంటినిండా నౌకర్లు ఉన్నంత మాత్రాన ఇంట్లో వ్యక్తులకు ప్రశాంతత చిక్కుతుందని ఎక్కడా లేదు. అదంతా ఇంట్లో ఆడ మనిషిమీద ఆధారపడి ఉంటుంది. ఎవరికీ ఏచికాకూ కలగ కుండా చూచే నేర్పు శారద ఎక్కడ నేర్చుకుందో మరి! అందుకే శారద అంటే అందరికీగౌరవం.

ఈరోజు రాజారావు మేనమామ రమాకాంతరావు కూడా వచ్చాడు. ఈ మధ్యే తరుచుగా రాకపోకలుసాగిస్తున్నాడతడు.

రాజకీయాలు, అవీ ఇవి కబుర్లు దొర్లిపోతుంటే అన్నాడు, "శ్యామలను మీ ఇంటి చిన్నకోడలుగా చేయాలనుకొంటున్నానురా, రాజా!"

రాజారావు ఇబ్బందిగా నవ్వాడుగాని వెంటనే జవాబు చెప్పలేదు. ఈయనకు భారీ వ్యవసాయం ఉంది. డబ్బు దస్కం చేతిలో బాగానే ఆడుతోంది. వెనకటికి తమ్ముళ్ళకు ఫీజులకు, పుస్తకాలకు సమయానికి డబ్బు దొరక్క. "చాలా అవసరం, మామయ్యా! ఈ చిన్న సాయంచేస్తే జన్మంతా రుణపడి ఉంటాను'' అని ఎంతో జాలిగా ఉత్తరం వ్రాస్తే జవాబు కూడా యిచ్చేవాడు కాదు, మహానుభావుడు! ఇప్పుడు అందరి కళ్ళతో పాటు ఈయన కళ్ళు కూడా తమ మీద పడ్డాయి. వేణుకు, శ్యామ్‌కు కులాంతర వివాహాలు జరిగినప్పుడు అందరితోపాటు ఈయనా తిట్టుకుంటూ తిరిగినవాడే! చివరివాడికి బంధువుల్లో పిల్లే రావడం తనకు అభ్యంతరం కాదుగాని, తిరిగి బంధువులనుండి సంబంధం వస్తుందని, రావాలని మాత్రం ఆశించలేదు తను!

"నవ్వుతావేంరా? ఏ సంగతీ చెప్పాలి నాకు. నేను ఈ సంకల్పంతోనే బయర్దేరాను మరి!''

"అసలు ఈ సంకల్పం ఎలా కలిగింది, మామయ్యా. కులంలేనివాడితో సంబంధం కలుపుకోవాలనే ఉద్దేశ్యం ఎలా కలిగింది మీకు?"

"పుట్టాక కులం లేకుండా ఎలా ఉంటుందిరా? నాకున్న కులమే నీకూ ఉంది.'

"నాకు కులం ఉందేమోగాని అది నీ కులం మాత్రం కాదు. పుట్టుకతో వచ్చిన కులంకాదు మాది. వ్యక్తిత్వంతో ఏర్పరుచుకొన్నది! ఏ జాతి మనుషులకైనా ప్రవేశం లభించే విశాలమైన కులం మాది!''

''అవునురా! ఒప్పుకుంటున్నాను. అందుకే పిల్లనిస్తానని రావడం! నాకా పట్టింపులేం లేవు."

"ఇప్పుడులేవు. ఒకనాడు ఉన్నాయి!

"పరివర్తన అనేది మానవ సహజం కదా?''

రాజారావు ఎక్కువగా వాదించలేదు. తన ఇద్దరు తమ్ముళ్ళకు కులాంతర వివాహం చేసినప్పుడు ఈయన తిట్టుకొంటూ తిరిగిన వ్యక్తే. తాము నలుగురూ సమైక్యంగా, ఆర్థికంగా బాగున్నారు కాబట్టి బ్రతికిపోయారుగాని, ఆర్థికంగా చితికిపోయి, ఒక అంతస్తును చేరుకోలేక, ఎవరిదోవ వారిదై దిక్కుతోచని పరిస్థితిలో నిలబడి ఉంటే మామయ్యలాంటి వాళ్ళలో ఈ పరివర్తన సాధ్యమయ్యేదేనా? ఎప్పటికీ కాదు. వంగిన తలమీద పెద్ద పెద్ద బండరాళ్ళు ఎత్తివేసి చితకకొట్టి, ప్రాణం తీసేవారే! 'భగవాన్! ఈ పెళ్ళి ఎందుకు చేసుకున్నాను' అని విలపించేలా చేసేవారే. ఆర్థికంగా బాగున్నారు కాబట్టి,

తామంతా సమైక్యంగా ఉన్నారు కాబట్టి ఆనాటి అనాచారమే ఈనాడు ఆదర్శమైంది పాపం! శ్యామలను ఈ ఇంటికిస్తే కలసి ఉండాలని ఎక్కడుంది? ఎవరి ఉద్యోగంమీద వాళ్ళు వెళ్ళిపోతే-కులం చెడ్డ ఇంటితో సంబంధం కలుపుకొన్నాడన్న అప్రదిష్ట ఉండనే ఉండదు మరి! మామయ్య లౌక్యం తెలిసినా రాజారావు ముఖం పట్టుకు కడిగివేయలేక పోయాడు. నలుగుర్లో ఒక పెద్దమనిషిని అవమానించడమెందుకని ఊరుకున్నాడు.

"నాకేదో ఒకటి తేల్చి చెప్పాలి!"

"ఏదో ఒకటి తేల్చి చెబుతాను. కాని, ఇప్పుడేకాదు. ఎందుకంటే తుది నిర్ణయం నాదే అయినా మిగతా మగ పిల్లలను, కోడళ్ళను అడిగి అందరి అభిప్రాయం, సలహా తీసుకొన్న తరువాత గాని ఏం చెప్పను!"

"ఇదేదో రాజ్యాంగ వ్యవహారం చేశావేమిటిరోయ్?"

రాజారావు నవ్వాడు.

"శారదమ్మా! శ్యామలను నీ చేతిలో పెట్టాలనుకొన్నాను. నీపైనే ఉంది ఆ భారం.''

"మా ఇంట్లో సిఫార్సులూ, లంచాలూ పట్టరు, బాబాయిగారూ!" సరదాగా అంది శారద.

"రాజారావుగారూ!'' మరొక కంఠం గంభీరంగా వినిపించింది. ఆ కంఠం చీఫ్ ఇంజనీరుగారిది. శ్యామసుందర్ పై ఆఫీసరాయన. "నేను ఎన్నోనాళ్లుగా అనుకొంటున్నాను. మా ఉషను మీ రమణకు యివ్వాలని. సందర్భం వచ్చింది గనుక బయటపెడుతున్నాను."

"ఇంత చిన్నవయస్సు..."

"ఇద్దరి వయసూ చిన్నదేనయ్యా! సంబంధం స్థిరం చేసుకొంటే, పెళ్ళివాళ్ల చదువులైపోయాక చేద్దాం! కట్నం క్రిందికి మీ రమణను ఫారిన్ చదువుకు పంపిస్తాను!"

ఇంతసేపూ శ్రోతగా మాత్రం కూర్చొన్న వేణు గొంతు సవరించుకొన్నాడు. "నేను మీ కంటే చాలా చిన్నవాడిని ఒకమాట చెబితే ఏమనుకోరుకదా!"

''చెప్పండి ''

"కట్నం ఇంతిస్తామని చెప్పలేక అబ్బాయిని ఫారిన్ చదువుకు పంపి ఆ రూపంగా కట్నం చెల్లించి మీ అంతస్తును చూపాలనుకొంటున్నారు. కట్నం తీసుకోవడం ఎంత హీనమో, ఇవ్వడమూ అంతేనని మీకు తెలియదా? మనం చదువుకొన్నాం. సంస్కారం ఉంది. అంతస్తు ఉంది. ఆర్థిక పరిస్థితి బాగుంది. మధ్యతరగతి వాళ్లు, ఆర్థికంగా ఎన్నో సమస్యల్లో చిక్కుకొన్నవాళ్లూ ఎలాగా ఈ కట్నం తీసుకోవడమనే ప్రలోభం నుండి తప్పించుకోలేరు. వాళ్లకు డబ్బు ఎంతో అవసరం కాబట్టి!

"కాని, మనకేమిటి తక్కువ? ఆడపిల్ల తెచ్చే కట్నం డబ్బుతో మనం ఏమిద్దెలు లేపాలని? మనమూ మన అంతస్తును చూపడానికి రేట్లు పెంచుకొని ఒక దురాచారం బలిసిపోడానికి ఆహారం ఎందుకు పెట్టాలి? ఉషను చేసుకొంటే మా రమణను ఫారిన్ పంపుతామన్నారు కాబట్టి చెబుతున్నాను. ఆ అవసరం మీకు లేదు. రమణ చాలా తెలివైన కుర్రాడు. ప్రభుత్వ స్కాలర్‌షిప్ దొరికినా దొరక్కపోయినా వాడిని ఫారిన్ చదువుకు పంపాలనే అనుకొన్నాం. అందరికీ సంబంధంనచ్చితే మీ ఉష మా కోడలవుతుంది. మీరుమాకు ఆశలేవీపెట్టక్కర్లేదు."

పచ్చి వెలక్కాయేదో గొంతు కడ్డం పడ్డట్టుగా ఒక నిమిషం మాట్లాడలేక పోయారు ఇంజనీరుగారు! సిగ్గుతో ఎర్రబడిన ముఖంలోకి నవ్వు తెచ్చుకుంటూ. "అందుకే మీ కుటుంబమంటే నాకెంతో గౌరవం. మీ ఆదర్శం అభినందించక తప్పదు. మీ సమిష్టికుటుంబం వెయ్యి కాలాలపాటు వర్ధిల్లాలని నా ఆకాంక్ష!" అన్నారు "డాక్టర్లు, ఇంజనీర్లు, విద్యాదానం చేసే గురువులు, ఫారిన్‌రిటర్న్‌డ్ మనదేశంలో చాలామంది ఉన్నారు కాని వీళ్ళు ఒకింట్లో ఒక్కత్రాటిమీద కలిసి జీవించడమే అద్భుతమైన సంగతి!"

"నిజంగా మీ అభినందనలందుకోవలసింది ఈ మహారాణిగారే. మాసుఖం, శాంతి, మా సమైక్యత అన్నీ ఈమెమీద ఆధారపడిఉన్నాయి" రాజారావు భార్య వంక చూచాడు నవ్వుతూ.

శారద సిగ్గుగా నవ్వింది.

వేణు కూతురు రాధిక శ్యామ్‌బాబును ఎత్తుకువచ్చింది.

"ఒసే ఎవరిచ్చారే నీ కెత్తుకోడానికి? మెడలు పడే శావంటే?" శారద గబుక్కున బాబును ఎత్తుకొని గుండెలకు అదుముకొంది.

రాధిక కుర్చీవెనుక నిలబడి పెద్దమ్మ మీదికి ఒంగి ఏమిటో చెబుతూంది. శారద పకపక నవ్వుతూ ఆ పిల్ల బుగ్గగిల్లి లేచి ఇంట్లోకి వెళ్ళిపోయింది. పట్టుచీరలో పచ్చగా మెరిసిపోతూ హుందాగా ఉందామె. ఆ ఇంట్లో ఆమెస్థానం,దర్పం చాలామంది ఆడవాళ్ళకు ఈర్ష్యకలిగిస్తూ ఉంటుంది

రాజారావు తిరిగి అన్నాడు: "సంసారంలో తల్లివేరులాంటిది గృహిణి. ఆమె ఆరోగ్యంమీదా, మనోదార్ఢ్యంమీద ఈ సంసార వృక్షం ఎలా ఆధారపడిఉందో ఈ కొమ్మలూ, రెమ్మలూ చీడను దరిజేరకుండా ఆరోగ్యంగా ఉండడం అంతే ముఖ్యం! ఈ సంగతి కుటుంబంలోని ఇతరవ్యక్తులు గుర్తించిననాడు ఏ కుటుంబంలోనైనా చీలికలు రావు.

"ముఖ్యంగా మా శారదకు మేమెంతో రుణపడివున్నాం. ప్రేమించడం, ఇవ్వడంలోనే ఆమె ఔన్నత్యం నిలుపుకొంది. తీసుకోవడం తెలియనంతవరకు ఆమెస్థానం ఎప్పుడూ అలాగే ఉంటుంది!"

———